27లోగా దరఖాస్తులు చేసుకోవాలి

ఎదులాపురం, జూలై 23 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అభ్యర్థులు ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని నేషనల్ అకాడమీ ఆఫ్ కాన్ స్ట్రక్షన్ (న్యాక్) అసిస్టెంట్ డైరెక్టర్ నాగేంద్రం, న్యాక్ కేంద్రం ఇన్‌చార్జి ద్యావంత్ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 వరకు చివరి తేదీ ఎంపికైన వారికి కంపెనీలో కాన్‌స్ట్రక్షన్ ఆఫీసర్ ఉద్యోగాలు లభిస్తాయని పేర్కొన్నారు వివరాలకు 9866565156 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఎస్సీ అభ్యర్థులకు ఉచిత ప్రవేశం, శిక్షణ ఇచ్చి అనంతరం జాబ్ కల్పించబడుతుందని తెలిపారు.

విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

బోథ్, జూలై 23 : విద్యార్థినులు ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని సోనాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు నవీన్ రెడ్డి సూచించారు. మంగళవారం బోథ్‌లోని బాలికల ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ కవిత, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రుచికరమైన భోజనాన్ని అందించాలి

దస్తురాబాద్, జూలై 23 : విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో రమేశ్ సూచించారు. ఆకొండపేట గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎంపీవో అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ప్రధానోపాధ్యాయుడు వేణు, టీచర్ రాజమణి ఉన్నారు.

ఫ్రీస్కూళ్లపై అవగాహన కల్పించాలి

ఖానాపూర్, జూలై 23: చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరేలా ఫ్రీ స్కూళ్లపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని ఖానాపూర్ సీడీపీవో సరిత టీచర్లకు సూచించారు. మంగళవారం బాదనకుర్తి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పోషక పదార్థాలకు సంబంధించి పలు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ శ్రీలత ఉన్నారు.

తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి

ఎదులాపురం, జూలై 23 : సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న తరుణంలో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రతి శుక్రవారం డ్రై డేతో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పీహెచ్‌సీ పరిధిలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులున్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏపీడమిక్ కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని, 8639523332 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎదులాపురం, జూలై 23 : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు గాజేంగుల రాజు అన్నారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని నేతాజీచౌక్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 26వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమానికి కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు పాల్గొన్నారు.

త్వరలో ఎంఆర్ఐ సేవలు ప్రారంభం

ఎదులాపురం, జూలై 23 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఏ ప్రభుత్వ దవాఖానలో లేనివిధంగా రిమ్స్‌లో పరికరాలు అందుబాటులో ఉన్నాయని డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ అన్నారు. మంగళవారం ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం రూ.11 కోట్ల 65 లక్షలతో రిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ మిషన్ అందుబాటులోకి వచ్చిందన్నారు. త్వరలోనే సేవలు ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ఇంద్రవెల్లి, జూలై 23: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని డీఆర్డీవో సాయన్న అధికారులకు సూచించారు. మంగళవారం ముత్నూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రం, వంటగది స్టోర్ రూంలను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించే సౌకర్యాలపై ఆరాతీశారు. అనంతరం ముత్నూర్, శంకర్‌గూడ గ్రామాల మధ్య గల త్రివేణి సంఘం ప్రాజెక్టును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టీఏలు మహేందర్, ప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై చర్యలు

నిర్మల్ చైన్‌గేట్, జూలై,23: ప్రభుత్వ స్థలాలు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాలలోని ప్రభుత్వ స్థలాలు చెరువు శిఖం భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖల వారిగా ప్రభుత్వ స్థలాల హద్దులను గుర్తించి కంచెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

రుణాలు మంజూరు చేయాలి

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సమావేశ మందిరంలో వార్షిక రుణ ప్రణాళిక 2024-25 పుస్తకాన్ని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, బ్యాంకు అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏరియా దవాఖాన సందర్శన

భైంసా, జూలై 23: భైంసాలోని ఏరియా దవాఖానను డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ మంగళవారం సందర్శించారు. ముందుగా అర్బన్ హెల్త్ సెంటర్‌లో డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆయన వెంట ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ డా. కాశీనాథ్, తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ తల్లికి వెండి కిరటం బహుకరణ

ఖానాపూర్, జూలై 23: మండలంలోని దిలవార్‌పూర్ ఎల్లమ్మ తల్లి ఆలయానికి రూ.65 వేల విలువ చేసే వెండి కిరటాన్ని మంగళవారం తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కొత్త శ్రీనివాస్ అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు సంతోష్ గౌడ్, రామగౌడ్, నర్సయ్య, రాజేశ్వర్, శ్రీనివాస్, శేఖర్, గంగన్న, గంగాధర్, మల్లేశ్, నాగరాజు తదితరులు ఉన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న వరంగల్ ఆర్‌జేడీ

బాసర, జూలై 23 : బాసర సరస్వతీ అమ్మవారిని మంగళవారం వరంగల్ రాష్ట్ర విద్యాశాఖ అర్‌జేడీ సత్యనారాయణ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనను అధికారులు స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట ఎంఈవో మైసాజీ, హెచ్ఎంలు సుధాకర్, విక్రమ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

జీవకోటి మనుగడకు చెట్లే ఆధారం

- ఆదిలాబాద్ డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్
- వనమహోత్సవంలో మొక్కలు నాటిన అధికారులు

ఎదులాపురం: వైద్యులతో కలిసి మొక్కలు నాటుతున్న డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్

ఎదులాపురం, జూలై 23 : జీవకోటి మనుగడకు చెట్లే ఆధారమని డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ అన్నారు. వన మహోత్సవంలో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో వైద్యులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, డీఈవో వైసీ శ్రీనివాస్, అదనపు డీఎంహెచ్‌వో గజానన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎం కార్యాలయంలో..

ఎదులాపురం, జూలై 23 : కాలుష్య నియంత్రణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన సూచించారు. ఆదిలాబాద్‌లోని ఆర్టీసీ డిపోలో ఈచ్ వన్-ప్లాంట్ వన్ కార్యక్రమం నిర్వహించారు. ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం సిబ్బందికి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా డీఎం కల్పన మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించి ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

'వనం'లా పెంచాలి

సోన్,జూలై 23: మొక్కలను ప్రతి ఒక్కరూ పెంచినప్పుడే వాతావరణం సమతుల్యత పెరుగుతోందని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. నిర్మల్ మండలం అనంతపేట్ గ్రామంలో నిర్వహించిన 'వన మహోత్సవం' కార్యక్రమానికి హాజరై మొక్కలు నాటారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో గోవింద్‌రావు, డీఆర్‌డీఏ విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, ఆర్డీవో రత్నకల్యాణి, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో గజానంద్, ఏపీవో తుల రామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ గురునాథ్ పాల్గొన్నారు.

దొంగతనాల నివారణకు బృందాలు

నిర్మల్ అర్బన్, జూలై 23 ః నిర్మల్ జిల్లాలో దొంగతనాల నివారణకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. మంగళవారం నిర్మల్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పోలీసు అధికారులతో ఆమె మాట్లాడారు. ఇటీవల ఖానాపూర్, నిర్మల్ పట్టణాల్లో చైన్ స్నాచింగ్‌లు జరిగాయని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు బాధితురాలు రాగా వారికి భరోసా ఇచ్చి పంపించామన్నారు. దొంగతనాలను నివారించేందుకు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌ను పటిష్ఠం చేయాలని, జైలు నుంచి వచ్చిన వారిపై నిఘా ఉంచాలన్నారు. 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో సీసీ కెమెరాలను అమర్చుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. సమీక్ష సమావేశంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ అశోక్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ పాల్గొన్నారు.

సమస్యలు రాకుండా క్షేత్రస్థాయి సిబ్బంది పని చేయాలి

దిలావర్‌పూర్, జూలై 23 : కూలీలు పనులు చేస్తున్న సమయంలో క్షేత్రస్థాయి సిబ్బంది చిన్నచిన్న సమస్యలు రాకుండా చూసుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. మంగళవారం దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయంలో 14వ విడుత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ప్రజావేదిక నిర్వహించారు. 01 ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు జరిగిన పనులపై క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ బృందం ఆడిట్ నిర్వహించింది. ఈ సంవత్సరం 12 గ్రామ పంచాయతీల్లో 422 పనులకు గాను రూ.4కోట్ల 80లక్షల 27,090 రూపాయల పనులు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు అరుణరాణి, మోహన్‌రెడ్డి, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏపీవో దివ్యరెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ సుధాకర్, నవీన్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, కూలీలు పాల్గొన్నారు.

కేంద్ర విద్యశాఖ మంత్రిని కలిసిన ఎంపీ

విద్య శాఖ మంత్రితో మాట్లాడుతున్న ఎంపీ నగేశ్

ఎదులాపురం, జూలై 23 : ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ మంగళవారం ఢిల్లీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రదాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో నవోదయ, కేంద్రీయ పాఠశాలలు మంజూరు చేయాలని కోరారు. తప్పకుండా త్వరలో మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు.

ప్రత్యేక బీసీ ఉప ప్రణాళికను ఏర్పాటు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, జూలై,23: కాంగ్రెస్ ప్రభుత్వం రూ.20వేల కోట్లతో ప్రత్యేక బీసీ ఉప ప్రణాళికను ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంబడి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం నిర్మల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు హామీ ఇచ్చినట్లుగా కామారెడ్డి డిక్లరేషన్ పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా బీసీ కులగణన అసెంబ్లీ సాక్షిగా ఆమోదం తెలపాలన్నారు. బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.

పోడు భూముల విరాసత్ పట్టాలు ఇవ్వాలి

నేరడిగొండ, జూలై 23 : ఆర్‌వోఎఫ్ఆర్ పోడు భూముల విరాసత్ పట్టాలు ఆరు సంవత్సరాలుగా ఆదివాసీ గిరిజనులు ఐటీడీఏ చుట్టు తిరుగుతున్నారని అధికారులు సంబంధిత పట్టాలను వెంటనే ఇవ్వాలని లైవ్ బంజారా జిల్లా అధ్యక్షుడు జాదవ్ మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం నేరడిగొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన బిడ్డలకు అధికారులు నిర్లక్ష్యం కారణంగా విరాసత్ పట్టాలు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం ఆదివాసీల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పట్టాలు అందించాలని కోరారు. సమావేశంలో మండలాధ్యక్షుడు పాండు, నాయకులు వసంత్‌రావ్, సురేందర్ పాల్గొన్నారు.

కేటీఆర్ జన్మదిన వేడుకలు ఊరురా ఘనంగా జరుపుకోవాలి

ఖానాపూర్, జూలై 23: బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు బుధవారం ఊరురా ఘనంగా జరుపుకోవాలని ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నాయకుడు భూక్యా జాన్సన్ నాయక్ పిలుపునిచ్చారు. గ్రామ, పట్టణ, మండల, అనుబంధ సంఘాల కమిటీలు, నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు వేడుకల్లో పాల్గొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఖానాపూర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తాలో ఉదయం 10 గంటలకు కేటీఆర్ బర్త్‌డే వేడుకలు జరుగుతాయని మండల, పట్టణ అధ్యక్షుడు రాజగంగన్న, గౌరికర్ రాజు పేర్కొన్నారు. కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

సదర్‌మాట్‌కు స్వల్పంగా పెరిగిన వరద

ఖానాపూర్, జూలై 23: ఖానాపూర్, కడెం ప్రాంత రైతాంగానికి జీవనాధారమైన సదర్‌మాట్ ఆనికట్‌కు రెండు రోజుల నుంచి వరద స్వల్పంగా పెరగడం ప్రారంభమైంది. సదర్‌మాట్ ఆనికట్ సామర్థ్యం 12 అడుగులు కాగా మంగళవారం 8 అడుగుల నీటి మట్టం ఉంది. అడ్డుగోడ పై నుంచి 5 అంగుళాల నీరు గోదావరిలోకి ప్రవహిస్తున్నది, ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా సదర్‌మాట్‌కు వరద రావడం ప్రారంభమైనట్లు నీటి పారుదల శాఖ ఏఈఈ ఉదయ్ కుమార్ తెలిపారు. అనికట్‌కు అదనంగా వచ్చే నీరు అడ్డుగోడను దూకి గోదావరిలో కలుస్తుందని పేర్కొన్నారు. ఎగువన వానలు కురవడంతో సదర్‌మాట్ చెంత నీటి మట్టం మరింత పెరిగే ఆవకాశాలున్నాయని అన్నారు. పశువుల కాపరులు, మత్స్యకారులు గోదావరి పరివాహక ప్రాంతాలకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

చైన్ స్నాచింగ్

మూడు తులాల బంగారం అపహరణ

నిర్మల్ అర్బన్, జూలై 23 : నిర్మల్‌లో మంగళవారం రెండు చోట్ల చైన్ స్నాచింగ్‌లు జరిగాయి. నిర్మల్ పట్టణంలోని మంజులాపూర్ కాలనీకి చెందిన సుభద్ర శాస్త్రినగర్ కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు మెడలోని రెండు తులాల బంగారు గొలుసును అపహరించుకుపోయారు. ఇదిలా ఉండగా స్థానిక వివేకానంద్ చౌక్ వద్ద గల మయూరి హోటల్ ఎదురుగా మెట్‌పెల్లికి చెందిన మహిళ తమ కుమార్తె ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చి ఆమె మెడలో నుంచి తులం బంగారాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

కొత్తం శివ కార్తీక్ (ఫైల్)

జైనథ్, జూలై 23 : ఆదిలాబాద్ రూరల్ మండలం చాంద(టీ) గ్రామానికి చెందిన కొత్తం శివకార్తీక్(23) మిత్రులతో కలిసి సోమవారం జైనథ్ మండలం డొల్లార పెన్‌గంగ నదిలో స్నానానికి అని వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతైన విషయం తెలిసిందే. అయితే యువకుడి కోసం డీడీఆర్ఎఫ్ బృందంతో పాటు జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్ పురుషోత్తం ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం శివకార్తీక్ మృతదేహం పెన్‌గంగ డొల్లార సమీపంలో లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు మర్చురికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు.

కౌట్ల(కే)లో దొంగతనం

సోన్, జూలై 23: నిర్మల్ మండలం కౌట్ల(కే) గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం జరిగినట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ సాయికుమార్ తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.బందెన సిద్దార్థ తమ బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండగా ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి తిరిగి మంగళవారం ఇంటికి వచ్చారు. ఇంటి తాళం, బెడ్ రూంలో ఉన్న బీరువా పగలగొట్టి సామన్లు చిందరవందగా పడి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు విచారణ జరుపగా రూ. 25 వేలతో పాటు అర్ధ తులం బంగారం, ఐదు తులాల వెండి అపహరణ జరిగినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ఎదులాపురం, జూలై 23 : మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమం ద్వారా వివిధ యూనిట్ల స్థాపన కోసం పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో మహిళా శక్తి కార్యక్రమంపై జిల్లా, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, డీపీఎంలు, ఏపీఎంలకు మైక్రో ఎంటర్ ప్రైజెస్, మీ సేవ కేంద్రాలు, కుట్టు మిషన్ కేంద్రాల పై ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో వివక్షను ప్రదర్శిస్తూ పొరపాట్లకు ఆస్కారం కల్పిస్తే, సంబంధిత ఏపీఎంలను బాధ్యులుగా పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మొత్తం టార్గెట్ 167 కుట్టు మిషన్ కేంద్రాలు కాగా ఐడెంటిపై చేసిన లబ్ధిదారులు 1050, యూనిట్ కేంద్రాలు 104 యూనిఫామ్స్ కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అందిస్తున్నామని, తద్వారా ఒక్కో జత కుట్టుకూలీ 75 రూపాయలు చొప్పున మహిళా సంఘాలకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. భవిష్యత్తులోనూ వీరికి అంగన్‌వాడీ సెంటర్లు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లు కుట్టించే ఆర్డర్లు కూడా అందిస్తామని అన్నారు. .మైక్రో ఎంటర్ ప్రైజెస్ ద్వారా ఐడెంటిపై చేసిన లబ్ధిదారులు 3124, టార్గెట్ 3929, మీ సేవా కేంద్రాల యూనిట్ టార్గెట్ 19, ఐడెంటిపై 19.మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలలో ఔత్సాహిక సభ్యులకు వారి అభిరుచికి అనుగుణంగా వివిధ యూనిట్ల స్థాపన కోసం ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని ఏపీఎంలను కలెక్టర్ ఆదేశించారు. ఒరియంటేషన్ ప్రోగ్రాంలో డీఆర్డీఓ సాయన్న , ఇందిరా మహిళా శక్తి సభ్యులు వనజ, ఏపీఎం, డీపీఎం, అన్ని మండలాల సమైఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దివ్యాంగుల కౌన్సెలింగ్

విద్యార్థికి ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

బాసర, జూలై 23 : ఆర్జీయూకేటీ బాసరలో 2024-25 విద్యా సంవత్సరానికి దివ్యాంగుల కౌన్సెలింగ్ మంగళవారం ముగిసిందని ట్రిపుల్ ఐటీ అధికారులు తెలిపారు. క్యాంపస్ ప్రాంగణంలోని అకాడమిక్ బ్లాక్‌లో దివ్యాంగ విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టారు. స్పెషల్ ఆఫీసర్ సృజన మాట్లాడుతూ.. అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. మిగిలిన సీట్ల ఖాళీలను మూడో విడుత భర్తీ చేస్తామని, దానికి సంబంధించిన జాబితాను త్వరలో ప్రకటిస్తామన్నారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ఎదులాపురం, జూలై 23 : ఉన్నత చదువుల నిమిత్తం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోనాలకు చెందిన ఎస్సీ విద్యార్థి ఉన్నతి మాన్యకు ల్యాప్‌టాప్‌ను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్సీడీవో భగత్ సునీతకుమారి, సూపరింటెండెంట్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

వర్షాల దృష్ట్యా ఏ ప్రమాదం ముంచుకొచ్చినా, అక్కడకు చేరుకునే విధంగా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని.. ఇందుకోసం కలెక్టరేట్‌లో 24 గంటలపాటు టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామని కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విపత్కర పరిస్థితుల్లో సాయం కోసం ఫిర్యాదులు స్వీకరించడానికి కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నంబర్ 1800 4251939ను కేటాయించడం జరిగిందన్నారు. రానున్న 24-48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఖాసీరాం, మహమ్మద్ షఫీ.. మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు సయ్యద్ అనిజ్, అశోక్.. రాత్రి 10 ల నుంచి ఉదయం 6 గంటల వరకు సుభాష్, డి.లక్ష్మణ్, జూనియర్ అసిస్టెంట్‌లను కేటాయించామని పేర్కొన్నారు.

ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలి

ఎదులాపురం ,జూలై 23 : గ్రామాలను సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకోవాలని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా వ్యాప్తంగా నమోదైన కేసుల వివరాలను వాటి స్థితిగతులను పరిశోధన విధానాన్ని పరిశీలించడానికి జిల్లా పోలీసు అధికారులతో పలు సూచనలు చేశారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అందజేత

జైనథ్, బేల పోలీస్ స్టేషన్ల పరిధిలో వివిధ కారణాలతో సెల్ ఫోన్లను పోగొట్టుకున్న 14 మంది బాధితులకు పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో ఎస్పీ గౌష్ ఆలం అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, జీవన్ రెడ్డి, నాగేందర్, హసిబుల్ల, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది డీసీఆర్‌బీ, పోలీసు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు అంతర్జాతీయ గుర్తింపు

నిర్మల్ అర్బన్, జూలై 23 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మూడు విభాగాల్లో అంతర్జాతీయ గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ భీమారావు తెలిపారు. సోమవారం హైమ్ అంతర్జాతీయ సంస్థ అధికారులు కళాశాలను సందర్శించి ఆడిట్ ని